# శ్రీయుని బాధలు

"వీళ్లకి బుద్ధి లేదు" మనసులో అనుకోవలసిన మాట పైకి అనేయడంతో వచ్చింది అసలు చిక్కు

"ఎవరికి?"

ఏది కాకూడదనుకొంటామో అదే జరగడంలోనే బ్రతుకులో తమాషా కనిపించేది. పొరపాటున నోరు జారిన ఆ మాట ఎవరి చెవిన పడకూడదనుకొన్నానో ఆమె వినసే వింది. వంట ఇంటిలోంచి గరిట చేత పుచ్చుకొని, అపర అన్నపూర్ణలా రంగంలోకి వచ్చిన అర్థాంగి అడగనే అడిగింది.

"ఇంకెవరికి... మీ వాళ్లకే". అంతదాకా వచ్చేక వెనుదీసేందుకు అహంకారం ఒప్పుకోలేదు.

"ఏం... మీ కాళ్లు కడిగి పిల్లని మీ చేతిలో పెట్టినందుకా?"

"తెల్లవారిందీ.. సాధింపులకి..."

"మీ పుల్లవిరుపు మాటలకి తెల్లవారగా లేంది."

"ఇదిగో, సరోజా, ఈ రోజు నాకు పీకలమొయ్య పనుంది. ఉదయాన్నే నీతో వాదన వేసుకు కూర్చోడానికి తీరిక లేదు."

"నాకు మహా ఉన్నట్లు"

"అదిగో అదే వద్దన్నది... మాటకి మాట"

"అవును..... అసలు విషయం చెప్పకుండా మీరు మా వాళ్లమీద లేవడం దేనికి?"

"మీ అన్నగారు, వదినగారు సకుటుంబంగా ఈ రోజు వస్తున్నారట"

"అందుకా అంతలా చిందులు తొక్కుతున్నారు?"

"అందుకుకాదు. ఆ ఇచ్చిన టెలిగ్రామ్ ఏదో తిన్నగా ఇచ్చి ఏడవకూడదా అని. జి.టి.లోనో, జనతాలోనో వస్తారట. స్టేషనుకి రావాలిట.

"అంత ఇష్టం లేకపోతే వెళ్లకండి. నా కోసం ఇంత దూరం వచ్చినవాళ్లు

ఇంటికి వచ్చి నన్ను చూడకుండా తిరిగి వెళ్లిపోరు."

"ఇష్టం లేక కాదు... ఆ వచ్చేది దేనిలో వస్తున్నారో స్పష్టంగా రాయకూడదా అని. జి.టి.కి, జనతాకి మధ్య రెండు గంటల వ్యవధి. ఇంటికి వచ్చిందికి లేదు. అక్కడ ఉండిందికి కాదు."

"మీలా పదిహేను రోజులకి ముందరే ట్రెయిన్‌లో బెర్తులు రిజర్వు చేయించుకొని, ఫలానా రోజు, ఫలానా రైలు అని వర్తమానాలు పంపడానికి వాళ్లేం మహాపట్నాలలో నివసించడం లేదు. ఫస్ట్‌క్లాసుల్లో ప్రయాణం చెయ్యడం లేదు. ఆ ఊరినుంచి బయట పడాలంటే బళ్లూ, బస్సులూ దాటి, రెండు రైళ్లు మారి మరీ రావాలి. దేనికి టికెట్టు దొరికితే, దేనిలో చోటుంటే అందులో వస్తామంటూ రాసేరు. దానికింత రాద్ధాంతం ఏమిటి? మీ కంత కష్టంగా ఉంటే వెళ్లొద్దని ముందే చెప్పేసుగా... వాళ్ల బాధలేవో వాళ్లు పడతారు"

ఇల్లాలు అంత స్పీడులో ఓ దండకం వల్లించి, అంత విసురుగా వంట ఇంట్లోకి అంతర్ధానమైపోతే, ఆమె మనసులోని మాట గ్రహించి క్రియలో పెట్టకుండా ఉండడానికి ఏ మగరాజుకైనా ఎన్ని గుండెలు ఉండాలి? మరుక్షణం నుంచి ఇంట్లో మొదలయ్యే కోల్డ్‌వార్‌కి సిద్ధంగా ఉంటే చెప్పలేం కాని...

చిన్నప్పుడు చూసిన స్టేజి నాటకాల్లో సత్యభామ పాడిన 'మీరజాలగలడా' అన్న పాట గుర్తుకొచ్చింది. సత్యభామ ఒట్టి భోళామనిషి కాబట్టి మనసులో మాట ఏదో అలా గర్వంగా పైకి అనేసింది. అలా కుండబద్దలు కొట్టినట్లు పైకి అనకపోయినా, ఆ మాటని ప్రతి భామా ఏదో సమయంలో మనసులో అనుకోకుండా ఉండదనే నా అభిప్రాయం.

సంసార రథం సాఫీగా సాగిపోవాలంటే ఇంట్లో గృహలక్ష్మి చేసే గణగణ గిన్నెల చప్పుళ్లు కాకుండా, గలగల గాజులు రవళులు వినరావాలంటే, అర్ధాంగి ఆనతిని మీరకుండా సాధ్యమైనంతవరకు నడుచుకుపోవడంలోనే - అందునా అది ఆమె పుట్టింటికి సంబంధించిన విషయమైనప్పుడు - మగవాడి మనసుకి హాయి, ఒంటికి క్షేమం ఉంటుందని నా నమ్మకం.

అందుకే ఆ రోజు మిగిలిన పనులన్నింటిని ఓ మూలకినెట్టి.. 'రాముడా... దేవుడా' అనుకొంటూ ఆ ఎండలో స్టేషనుకి బయలుదేరేను. పది నిమిసాలకి పైగా క్యూలో నిలబడి ప్లాట్‌ఫారమ్ టికెట్టు ఒకటి సంపాదించి, మెల్లగా బయటపడేసరికి, కాస్త దూరంలో రామస్వామి కనిపించేడు.

"ఎక్కడికి వెళుతున్నారు? ఎవరైనా వస్తున్నారా? ఏమిటి సంగతి?"అంటూ పలకరించేను.

అతడు ఒక్కడే లేడు. అతడి వెనుకగా సరస్వతమ్మ కూడా ఉంది. నా ప్రశ్నకి రామస్వామికి బదులుగా ఆవిడ జవాబు చెప్పింది - "అమ్మాయిని, అల్లుణ్ణి సాగనంపడానికి వచ్చేం" అంటూ

"ఏ అమ్మాయి?"

"దేశంలో ఇంకెవరున్నారు?... అరుణ...."

ఏమిటి, అరుణకి పెళ్లయిందా? ఇది ప్రశ్నకాదు. స్వగతం. ఏం, అరుణ అందరిలాంటి ఆడపిల్ల కాదా? పెళ్లి చేసుకోకుండా ఎప్పటికీ కన్యగా ఉండిపోతానని నీ చెవిలో రహస్యం కాని చెప్పిందా? నా తెలివితక్కువ ప్రశ్నకి మనసు వెక్కిరించింది.

" నా అభిప్రాయం అది కాదు". ఒక్క కసురుతో దాని నోరు నొక్కేసేను. అయినా, అరుణకి పెళ్లి అయిందన్న విషయాన్ని నమ్మలేకుండా ఉన్నాను. నా ఆశ్చర్యానికి కారణం బొత్తిగా లేకపోలేదు. అసలు కథ ఏమిటంటే...

ఆరేళ్లుగా పెళ్లి కోసం ఎదురు చూస్తూ కూర్చున్న ఆడపిల్ల అరుణ. ఆమె తండ్రి రామస్వామికి అంతో ఇంతో ఆస్తి లేకపోలేదు. పరువుగా నలుగురిలో తిరగగలిగేపాటి ఉద్యోగం కూడా ఉంది. తగుమాత్రం కట్నకానుకలు ఇచ్చి ఆడపిల్లకి పెళ్లి చెయ్యగల స్థితిలో ఉన్నాడు అతడు.

ఇంక అరుణ గురించి చెప్పాలంటే కళ్లు చెదర్చే అందం లేకపోయినా, అనాకారి మాత్రం కాదు. ఊళ్లేలడానికి, ఉద్యోగాలు చెయ్యడానికి తగినంత పెద్ద చదువులేకపోయినా, హైస్కూలు చదువు పూర్తిచేసి కాలేజీలో చేరేననిపించుకొంది.

తట్టల్లా, బుట్టల్లా సిగలు సింగారించుకొని పార్టీలలో, ఫంక్షన్‌లలో తిరిగే నవనాగరిక యువతి కాకపోయినా, తనకి పుస్తె కట్టినవాడిని, ఇంటిని, పిల్లల్ని సుఖశాంతులతో ఉంచేపాటి సభ్యతా సంస్కారాలు, తెలివితేటలు ఉన్నాయి.

అయితే, అరుణకి అంత వయసు వచ్చేదాకా పెళ్లి కాకపోవడానికి పైన చెప్పిన కారణాలేమీ కాక ఇంకేవో ఉన్నాయంటే ఎవరికి నమ్మబుద్ధి కాదు. గుమ్మంలోకి వచ్చిన ఒకటి, రెండు మంచి సంబంధాలు తిరిగిపోవడం చూసేవరకూ నేనూ నమ్మలేకపోయేను. అలా ఏ సంబంధం కలిసిరాకపోవడానికి కారణాలుగా ఆ నోట, ఈనోట విన్న సమాచారం ఇది....

రామస్వామి, సరస్వతమ్మల వివాహం పెద్దల ఇష్టానికి విరుద్ధంగా గుళ్లో జరిగింది. వర్ణాంతరం కావడం వల్ల. అరుణ చిన్నమేనత్త- వయసులో ఉండగా తలచెడిన ఆవిడ - వైధవ్యం అనుభవిస్తూ పుట్టింట పడి ఉండక, మొగుడు పోయేక పరీక్షలకి కట్టి ఉద్యోగం వెలగబెడుతున్నాది. అంతలో చాలదన్నట్లు ఎవడికో తెచ్చుకొన్న కడుపుని చాటుగా మాటుగా ఏ ఆసుపత్రిలోనే కడిగేసుకోక, తొమ్మిది నెలలు మోసి పిల్లణ్ణి కని, అల్లారు ముద్దుగా పెంచుకొంటున్నాది. ఇంక రామస్వామి పెద్ద కూతురు ఎదరింటి కిరస్తానీవాడి మాయలో పడి వాడితో లేచిపోయింది. ఆ వెనక వారు రిజిస్టరీ పెళ్లి చేసుకొన్నా, సాటి సంసార్లలో అది ఒక పెళ్లికింద పరిగణనకి రాలేదు. ఆ పిల్ల లేచిపోయినదానికిందే లెక్క! ఇటువంటి వంగడంలోంచి వచ్చిన అరుణ మాత్రం గుట్టుగా, మట్టుగా మొగుడితో కాపురం చేస్తుందా?

వీళ్ల కుటుంబ విషయాలు తెలిసిన వాళ్లు ఆ ఛాయలకే వచ్చేవారు కారు. కొత్తవాళ్లు ఎవరైనా పిల్లని చూసుకోవడానికి వస్తే సమయం మించిపోకుండా ఇరుగుపొరుగుల వాళ్లే అవసరమైన సమాచారం వారికి అందించి సంఘసేవ చేస్తుండేవారు.

"ఇంక దీనికి పెళ్లి కాదు" నెత్తిమీద రెండు చేతులు పెట్టుకొని వాపోయేది సరస్వతమ్మ.

"ఇంక నీ కూతురికి సంబంధాలు తేవడం నా తరం కాదు. ఇద్దరూ

కట్టకట్టుకొని గంగలో దిగండి." కోపంతో విసుక్కునేవాడు రామస్వామి.

"మామయ్యగారూ! నిజంగా నా కింక పెళ్లి కాదంటారా?" దిగులుగా అడిగేది అరుణ

నిజానికి అరుణ పెళ్లి కోసం, మొగాడి కోసం అంతగా తపించిపోవడం లేదు. కాని అమ్మ, నాన్న తన పెళ్లికోసం పడుతున్న వేదన, క్షోభ చూసేక, ఎవడో ఒకడు... ఏ తలమాసిన వాడైనా సరే, వరుడంటూ వచ్చి తన మెడలో తాళి కడితే చాలని ఆరాటపడేది.

"పెళ్లి" అన్న మాట వినగానే బుగ్గ లెర్రపరచుకొని, సిగ్గుతో తల వంచుకొనే స్థితిలో ఉండవలసిన ఆడపిల్ల, అలా దిగులుగా అడుగుతుంటే నాకు, మనసులో బాధగా అనిపించేది. కాని, పైకి ఆ పిల్లకి ధైర్యం చెపుతూ, "అవుతుందమ్మా... ఆణిముత్యం లాంటి పిల్లవి.... నీకు పెళ్లెందుకు కాదూ... ఆ సమయం రావాలి. అంతే" అనేవాడిని ఓదార్పుగా

ఎప్పుడు వస్తుంది ఆ సమయం? అరుణ తలిదండ్రులతోపాటు మా వంటి పరిచయస్థులం కూడా ఆ శుభగడియ కోసం ఆత్రంగా ఎదురుచూసేం.

ఎప్పుడో అప్పుడు ఆ సమయం వస్తుందని నాకు తెలుసు. కాని, ఇంత త్వరలో వస్తుందని నేనుకూడ అనుకోలేదు. రెండు నెలలుగా ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతూ ఉండడం వల్ల, అరుణకి పెళ్లి అయిన విషయం ఆ నిమిషం దాకా నాకు తెలియకుండా పోయింది.

"వరుడెవరేమిటి?" వివరాల కోసం ప్రశ్నించేను.

"ఇంకెవరు... మా బాబిగాడే"! రామస్వామి జవాబు

ఇది ఇంకో అనుకోని విషయం.

భాస్కరం - రామస్వామి పెద్దక్క కొడుకు. ఆవిడ పోయేక కొంతకాలం వీరి ఇంట ఉండి చదువుకొనేవాడు. ఆ రోజుల్లో సరస్వతమ్మ ఆ పిల్లడిని ఎలా చూసేది జగమెరిగిన రహస్యం. చివరికి అత్తామామల ఆదరణ ఇంక భరించలేక, చెప్పాచెయ్యకుండా ఒక రోజు ఇల్లు వదిలి వెళ్లిపోయేడు ఆ కుర్రాడు.

అప్పటికి భాస్కరం వయసు పద్దెనిమిదికి లోపు. కాలేజిలో బి.ఎస్.సి. చదువు తూండేవాడు. తన నోటి మంచివల్ల, వీళ్ల, వాళ్ల సహాయం వల్ల ఎలాగో ఆ చదువు పూర్తిచేసుకొని ఏదో కంపెనీలో ఉద్యోగం సంపాదించేడనీ, పరువుగా తన బ్రతుకు తాను బ్రతుకుతున్నాడని తెలిసినవారివల్ల విన్నాను.

బ్రతుకులో బాగుపడ్డ వారికి అంతా బంధువులే. రామస్వామి నేర్పుగా వల విసిరి చేయి దాటిపోతున్న మేనల్లుడిని చేసుకొని ఉంటాడు. లేకపోతే అలా ఇల్లు వదిలి వెళ్లిపోయిన భాస్కరం తిరిగి వచ్చి అరుణని పెళ్లి చేసుకోవడం ఎలా జరిగి ఉంటుంది?– అనుకొన్నాను. కాని, రామస్వామి వలలో పడ్డానికి భాస్కరం మరీ అంత అమాయకుడు కాడు. ఆ కుర్రాడికి అత్తామామల పట్ల ఆపేక్ష లేకపోయినా, చిన్నప్పటినుంచి అరుణ అంటే అభిమానం ఉండేది. అరుణ పెళ్లికోసం అత్తామామలు పెడుతున్న అగచాట్లు విని ఉంటాడు. వాళ్ల కోసం కాకపోయినా, ఆ పిల్లని తలిదండ్రుల బారి నుంచి రక్షించడానికి పెళ్లికి సిద్ధపడి, తనంత తానుగానే వచ్చి ఉంటాడు.

ఏమైనా అరుణ అదృష్టవంతురాలు. తనంటే అభిమానం ఉన్న బావని భర్తగా పొందగలిగింది. ఒక విధంగా సరస్వతమ్మా, రామస్వామి కూడా అదృష్టవంతులే. ఏ దారిన పోయే దానయ్యకో, మూడో పెళ్లి ముసలాడికో ముడిపెట్టాలని చూస్తున్న కూతుర్ని మేనల్లుడి చేతిలో పెట్టి బరువు దింపుకొన్నారు.

ఎప్పుడు, ఎవరు వెళ్లినా, పెళ్లికాని కూతుర్ని గుండెలమీద కుంపటిలాగ మోస్తున్నానని గోలపెట్టే సరస్వతమ్మ అరుణ పెళ్లి అయిపోవడంతో హాయిగా ఊపిరి పీల్చుకొని ఉంటుందని అనుకొన్నాను.

మరి రెండు నిమిషాల్లో మూడో నెంబరు ప్లాట్‌ఫారమ్ మీదికి జి.టి. వస్తున్నట్లు లౌడ్‌స్పీకర్ ప్రయాణికుల్ని హెచ్చరించింది. ఆ దంపతుల దగ్గరసెలవు పుచ్చుకొంటూ, కుతూహలం కొద్దీ సరస్వతమ్మ వైపు చూసేను. ఆవిడ కళ్లు ఎర్రగా ఉన్నాయి. కనురెప్పలు ఉబ్బి ముందుకి పొడుచుకు వచ్చినట్లు ఉన్నాయి. పచ్చని ముఖం మీద ఎండిన కన్నీటి చారికలు అసహ్యంగా కనిపిస్తున్నాయి. పది లంఖణాలు

చేసి లేచిన రోగిలా ఉంది ఆమె.

ఏదో విధాన ఇంత కాలానికి కూతురి పెళ్లి అయి అత్తవారింటికి వెళితే ఎంతో సంతోషంగా ఉండవలసిన సరస్వతమ్మ ఇలా ఉందేమిటి? భాస్కరంతో అరుణ పెళ్లి ఆమెకి ఇష్టం లేదా? క్షణకాలం మనసులో తిరుగాడిన ఆలోచన జి.టి. ప్లాట్‌ఫారమ్ మీదికి వచ్చి ఆగడంతో తప్పుకుపోయింది.

రావలసినవాళ్లు జి.టి.లో రాలేదు. ఈ కొస నుంచి ఆ కొస దాకా ప్లాట్‌ఫారమ్ పొడుగునా ఒకటికి రెండుసార్లు తిరిగి ఆ బండీలో రాలేదని నిశ్చయించుకొని ఇంటి ముఖంపట్టేను. ఆ రోజు జనతా రెండు గంటలు లేటు. ఇంటికి పోయి స్నానం, భోజనం పూర్తి చేసుకొని తిరిగి రావాలని బయలుదేరేను.

నా రాక కోసం గుమ్మంలోనే కాచుకొని ఉంది శ్రీమతి. ఒంటిరిగా కారుదిగిన నన్ను చూసి, "మీరు అసలు స్టేషనుకి వెళ్లేరా... రైలు పొడుక్కీ చూసేరా.... లేక నా కళ్లు తుడుపు కోసం ఇంటినుంచి బయలుదేరి ఇక్కడా, అక్కడా తిరిగి ఎంచక్కా ఇంటికి వేంచేసేరా?" అంటూ చిందులు తొక్కుతుందని ఊహిస్తూనే ఇంట్లో కాలుపెట్టేను.

గుమ్మంలో నన్ను చూస్తూనే చింకిచేటంత ముఖంతో ఎదురొచ్చింది సరోజ

"మీ వాళ్లు జి.టి.లో రాలేదు" పాలపొంగులాంటి ఆమె ఉత్సాహం మీద నీళు జల్లుతున్నాను అని బాధపడుతూనే ఆ మాట అన్నాను.

"సర్లేండి.... ఇంకా జనతా ఉందిగా...." అంది.

శ్రీమతి కంఠంలో ధ్వనించిన నిర్లిప్తతకి నా చెవుల్ని నేనే నమ్మలేకపోయేను. అలా ఆశ్చర్యంలో నేను అట్టే సేపు ఈదవలసిన అవసరం లేకుండానే అసలు విషయం బయటపెట్టింది సరోజ.

మా శంకరానికి రీసెర్చి స్కాలర్‌షిప్ వచ్చిందట. అదీ ఇల్లాలి ఆనందానికి కారణం.

శంకరం మా పెద్దవాడు. ఎమ్.ఎస్‌సి. పాసై రెండేళ్లుగా కాలేజీలో అసిస్టెంట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఏడాదిగా అమెరికా వెళ్లి పై చదువులు చదివిరావాలని

విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. అవకాశం ఉందని తెలిసిన యూనివర్శిటీకల్లా అప్లై చేసి, సహాయపడతారని తోచినివారినల్లా కలుసుకొంటూ అదే ధ్యాసగా ఉంటున్నాడు. నాలుగు నెలలుగా ప్రియుడి దగ్గరినుంచి రాబోయే తొలి లేఖకోసం ఎదురుచూసే ప్రియురాలిలా పోస్ట్‌మాన్ రాకకోసం దారికాస్తున్నాడు.

అప్పుడే తన కొడుకు అమెరికా వెళ్లి, డాక్టరేట్ పుచ్చుకొని తిరిగి వచ్చినంతగా సంబరపడిపోతున్నాది సరోజ. సుపుత్రుడి సంగతి చెప్పనే అక్కరలేదు. వాడికి అట్లాసులో మిగిలిన దేశాలన్నీ మాయమై ఒక్క అమెరికా మాత్రమే కనిపిస్తున్నాది. ఎవరితోనైనా వాడు వరుసగా పది మాటలు మాట్లాడేడంటే అందులో విధిగా రెండు మాటలు అమెరికా గురించి ఉండవలసిందే.

సంతోషంతో కాలం గడపడమే తెలిసిరాలేదు. ఆ మూడు నెలలు మూడు నిమిషాల్లా గడచిపోయేయి. తల్లీ కొడుకులు ఇంటా, బయటా ఒకటే హంగామా చేసి మరీ వదలిపెట్టేరు. వీసా, పాస్‌పోర్ట్, పి-ఫారాలు, డాక్టర్ పరీక్షలు వగైరా లాంఛనాలన్నీ పూర్తి చేసుకొని, ఒక శుభముహూర్తాన (సిద్ధాంతిగారు పెట్టిన శు భముహూర్తం కాదు సుమండీ, సుపుత్రుడు అంత కాలంగా ఎదురుచూసిన క్షణం వచ్చింది కాబట్టి అది మా కందరికీ శుభముహూర్తం) ప్రత్యేకం ఈ ప్రయాణం కోసం సరోజ బజార్లన్నీ గాలించి కొన్న సూట్‌కేస్ చేత బట్టుకొని విదేశయాత్రకి బయలుదేరేడు శంకరం. ఇంట్లో అంతా రెండు కార్లలో బయలుదేరేం వాడిని అంపకం పెట్టడానికి.

ఈ లోకంలో ఉన్న ఉత్సాహం ఆనందం, ఐశ్వర్యం, గర్వం అన్నీ మూర్తీభవించినట్లు ఉంది సరోజ. చివరి క్షణంవరకు కొడుక్కి ఏవో బుద్ధులు చెపుతూనే ఉంది. హెచ్చరికలు చేస్తూనే ఉంది. శంకరం ఎక్కిన విమానం పక్షిలాఎగిరి, గాలిలోకి లేచి కనుచూపు దూరం దాటిపోయేవరకు అక్కడ ఉండి అటు తరవాత ఇంటికి బయలుదేరేం.

ఇల్లు దగ్గర పడుతుంటే, క్షణక్షణానికి వాలిపోయే శీతాకాలం పొద్దులా సరోజ ముఖం వాడిపోయింది. ఇంట్లో కాలు పెట్టిందే తడవుగా, అంతవరకు ప్రయత్నం

మీద బిగపెట్టుకొన్న దు:ఖం అలకనంద వరదలా ఒక్కసారిగా పొంగుకొచ్చి ఆమెని ముంచెత్తింది. భోరున ఏడుస్తూ పక్కమీద వాలిపోయింది సరోజ.

రెండు గంటల క్రిందట వరకూ ప్రపంచంలో ఉన్న ఆనందం, తృప్తి అంతా తనకే అన్నట్లు తిరిగిన సరోజ, ఆరు నెలలుగా కొడుకు అమెరికా ప్రయాణం కోసం వాడికన్న మిన్నగా కలలుకన్న సరోజ... అంతలోనే ఆ ఆనందం అంతా తుడిచిపెట్టుకుపోయి ఆపుకోలేని దు:ఖంతో, అలా వెక్కి వెక్కి ఏడుస్తూంటే ఆమెని ఎలా ఓదార్చాలో తెలియక అక్కడినుంచి మెల్లగా జారుకొన్నాను.

సరోజలా కళ్లంట నీళ్లు పెట్టకపోయినా, నా పరిస్థితికూడా అంతకి భిన్నంగా లేదు. మనసంతా చికాకుగా ఉంది. తల దిమ్ముగా, జ్వరపడి లేచినట్లు ఒంట్లో నీరసంగా ఉంది. స్నానం చేసి, ఏదో ఇంత కడుపులో వేసుకొంటేనే కాని ఆ పరిస్థితి నుంచి కోలుకోలేనని తోచింది.

స్నానాల గదిలోకి వెళుతుంటే పక్క వరండాలోంచి సన్నగా ఏదో మూలుగు వినిపించింది. దాని వెంట స్వగతం లాంటి అప్పలమ్మ ఓదార్పు మాటలు.

ఎవరికేమయింది? అటు వెళ్లకుండా ఉండలేకపోయేను. లిల్లీ.... మా అందాల బొచ్చుకుక్క పక్కమీద పొర్లుతూ బాధతో మూలుగుతున్నాది. అప్పలమ్మ దాని పక్కనే కూర్చుని తల మీద రాస్తూ ఓదార్పు మాటలు అంటున్నాది.

నన్ను చూసి మెల్లగా తోక ఆడించింది లిల్లీ. జాలిగా నా వంక చూస్తూ బాధతో సన్నగా మూలిగింది. దాని ముఖం వాడి ఉంది. భారంగా ఊపిరి పీలుస్తున్నాది. పొట్ట ఉండిఉండి ఎగిరి పడుతున్నాది. అందమైన నల్లని ఆ సోగకళ్లతో లీలగా నీళ్లు తిరుగుతున్నట్లు అనిపించింది.

"అప్పలమ్మా! ఏమయింది... లిల్లీకి ఏమయింది?" అన్నాను ఆత్రంగా.

రెండురోజులై శంకరం ప్రయాణ సందట్లో లిల్లీని సరిగా చూడనేలేదు. దాని బాధ చూస్తుంటే నాకు కడుపులో మంటలాంటిది పుట్టింది. స్నానం లేదు, తిండి లేదు.... వెంటనే ఏ డాక్టర్ దగ్గరికైనా తీసుకుపోవాలనుకొన్నాను.

"ఏటి నేదు, బాబూ! మీరు ఎల్లి తానం సేసి రండి. వంటయ్యావారు తమ

కోసం సానాసేపై కనిపెట్టుక్కూకున్నారు" అంది అప్పలమ్మ ఆదోలా నవ్వుతూ.

అంతకన్న వివరంగా అడిగి తెలుసుకోవడానికి అప్పుడు నాకు ఓపిక లేదు. స్నానం, భోజనం కాందే ఏ పనికీ తయారుగా లేనని శరీరం మొండికెత్తి కూర్చుంది. ఇంకో ఆలోచన లేకుండా బాత్‌రూమ్‌లోకి దారి తీసేను.

స్నానం, భోజనం పూర్తి చేసుకుని బయటికి వచ్చేసరికి ఓ గంటకి పైగా పట్టింది. వరండా దాటి వస్తుంటే లిల్లీ విషయం గుర్తుకొచ్చింది. అది అంతకు పూర్వం ఉన్న చోటు ఖాళీగా ఉంది. దాని పక్కకూడా అక్కడ లేదు. బాధతో కూడిన దాని మూలుగుకూడా ఆ చుట్టుపట్ల వినిపించలేదు. లిల్లీ ఏమయింది? ఎక్కడ పెట్టేరు? ఆలోచిస్తూనే కాలు ముందుకి కదిపేను.

"నాన్నా... నాన్న.... మరేమో... మన లిల్లీకేమో...." ఉత్సాహంగా ఏదో చెప్పాలని వచ్చి, అంతలోనే అక్కగారి పిలుపు రాగా చెప్పవలసిన విషయం చెప్పకుండానే పరుగుపెట్టేడు చంటివాడు. సంగతేమిటో తెలుసుకోవాలని వాడి వెనకనే నేసూ దారితీసేను.

పెరటివేపు గదిలో తన కోసం అప్పలమ్మ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పక్కమీద విశ్రాంతి తీసుకొంటున్నాది లిల్లీ. దాని చుట్టుపక్కల మెల్లమెల్లగా కదలాడుతున్న నాలుగు కూనలు. లిల్లీ పక్కగా వాటిని చూసేవరకు అప్పలమ్మ ఆదోలా నవ్విన నవ్వుకి అర్థం ఏమిటో నా మనసుకి తోచనేలేదు.

లిల్లీ పిల్లల్ని నాకుతున్నాది తన్మయతతో. గంట క్రిందట దాని ముఖంలో కనిపించిన బాధ, యాతన ఇప్పుడు మచ్చుకికూడా అక్కడ లేదు. ప్రపంచంలో గల ఆనందం, తృప్తి అంతా తనదే అన్నట్లు ఉంది లిల్లీ.

–31-03-1971, ఆంధ్రప్రభ వార పత్రిక